పారిశుద్ధ్యం.. అధ్వానం

- ముందుకు కదలక కాలువల్లో పేరుకుపోయిన మురుగు
- దోమలతో ప్రజలు అవస్థలు

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం ప్రచారానికే పరిమితమైంది. మంగళగిరి నగర పరిధిలోని రత్నాల చెరువు ప్రాంతంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే తాండవిస్తోంది. రత్నాల చెరువులోని ఎస్టీ కాలనీ వీధుల్లో ఉన్న కాలువల దుస్థితి చూస్తుంటే పారిశుద్ధ్య పనులు నామమాత్రంగా నిర్వహిస్తున్నట్లు తేటతెల్లమవుతోంది. ఇళ్లకు ఆనుకుని ఉన్న కాలువల్లో పేరుకుపోయిన మురుగు నీరు అధికారుల నిర్లక్ష్యాన్ని చూపుతుంది.



కాలువలో అధ్వానంగా మురుగు



కాలువలు లేక నిలిచి పోయిన మురుగు



డ్రైనేజీ లేకపోవడంతో పరిస్థితి ఇలా

అలముకున్న నిర్లక్ష్యం..

స్వచ్ఛ మంగళగిరి అంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు కేవలం ప్రధాన రహదారుల మీదే శ్రద్ధ చూపుతున్నారు. నగరంలోని శివార ప్రాంతాలపై అధికారులు శీతకన్ను వేస్తున్నారు. సమయానికి విధుల్లోకి వచ్చామా, వెళ్లామా అనే ధ్యాసే తప్ప పనుల్లో జవాబుదారీతనం కనిపించడంలేదు. స్థానిక 12వ సచివాలయ సిబ్బంది సైతం పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించడం మానేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమాలను నిర్వహించడం, మరునాడే వదిలివేయడం పరిపాటిగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ మరీ దారుణంగా ఉంది. కాలనీల్లో మురుగునీరు నిల్వలు స్తంభించిపోయి దుర్వాసన వస్తోంది. చెత్తాచెదరం పేరుకుపోవడంతో దోమలు పెరిగి స్థానికవాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

ముందుకు పారని మురుగు..

వీధుల్లో ఉన్న మురుగు ఊరు దాటడం లేదు. రత్నాల చెరువు ప్రాంతంలోని ఎస్టీ కాలనీలోని పలు వీధుల్లో మురుగు నీరు బయటకు వెళ్లే కల్వర్ట్ దెబ్బ తినడంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కల్వర్టులు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని వారు వాపోతున్నారు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని.. మురుగు నివాసాల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు పారేందుకు కల్వర్టులు, లేని చోట కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పలుచోట్ల కాలువల పనులు సగం నిర్మించి వదిలి వేశారు. అధికారులు పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన



నిరసన తెలియజేస్తున్న నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: అఖిల భారత కార్మిక సంఘాల పిలుపులో భాగంగా తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్, ఇతర కార్మిక సంఘాలు మద్దతు పలికాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఐటీయూ జిల్లా నాయకులు వేముల దుర్గారావు, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ మంగళగిరి నియోజకవర్గ నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం దారుణమని అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీ ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ సమ్మె జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.బాబూరావు, బి.సూర్యప్రకాష్, కె.స్టీవెన్, లక్ష్మి, రేణుక, కమల, కొండయ్య, వెంకటయ్య, శ్రీనివాసరాజు, అంగన్‌వాడీ, ఆశా, భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల నిర్వీర్యంపై వినతి

దుగ్గిరాల: కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మండల సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి తాహసీల్దార్ ఐ.సునీతకు మంగళవారం సంబంధిత వినతిపత్రం అందజేశారు. నాయకులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ.. కార్మికులు కష్టపడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు మన్నవ నాగమల్లేశ్వర రావు, కార్యదర్శి వై.బ్రహ్మేశ్వర రావు, బి.అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలి

మంగళగిరి టౌన్: రేషన్ కార్డులకు సంబంధించిన 7 రకాల సేవలను ప్రజలు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో వినియోగించుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21 నుంచి ఈనెల 27వ తేదీ వరకు ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో కొత్త బియ్యం కార్డు, బియ్యం కార్డులో సభ్యుల చేరిక, విభజన, సభ్యుల తొలగింపు, కార్డు సరెండర్, చిరునామా మార్పు, ఆధార్ ఫీడింగ్ సరిచేయుట వంటి 7 రకాల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. మంగళగిరి పట్టణ, మండల పరిధిలోని ప్రజలు స్పెషల్ డ్రైవ్ వివరాల కోసం తమ దగ్గరలోని సచివాలయాలను సందర్శించాలని కోరారు. ఆయా సచివాలయాల సిబ్బంది కార్యక్రమాలు పూర్తయ్యే వరకూ ఎలాంటి సెలవులు పెట్టవద్దని ఆమె పేర్కొన్నారు. మంగళగిరి డివిజన్‌కు డీఈఈ సీహెచ్ రమేష్‌బాబు, తాడేపల్లి డివిజన్‌కు డీఈఈ కె.రాములను ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు, సిబ్బందికి ఏర్పాట్లు చేయవల్సిందిగా ఆ ప్రకటనలో ఆదేశించారు.

గెస్ట్ టీచర్ దరఖాస్తులకు ఆహ్వానం

తాడికొండ: గుంటూరు జిల్లా తాడికొండలోని ఏపీఆర్ స్కూల్ (బాలుర)లో ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీషు, తెలుగు, పీజీటీ, టీజీపీ, లైబ్రేరియన్‌లు కావాలని ప్రిన్సిపాల్ ఎం.జోగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 87126 25037 నంబరులో సంప్రదించాలన్నారు.

మైనర్ల డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరం

మంగళగిరి టౌన్: మైనర్లు డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని మంగళగిరి పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్ అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. 18 ఏళ్లు నిండని వారు వాహనాలు నడిపితే చట్టప్రకారం నేరమని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించకుండా రాకపోకలు సాగించే వారికి చలానాలు విధించామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న వాహన చలానాలను వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

23న పున్నమి చెరువుపై విచారణ

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులోని ఆక్రమణల చెరలో ఉన్న పున్నమ్మ చెరువు విచారణ ఈనెల 23వ తేదీన జరుగుతుందని సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు మంగళవారం తెలిపారు. బుధవారం జరగాల్సిన విచారణ శుక్రవారానికి వాయిదా పడినట్లు తెలిపారు.

లాంలో అక్రమ చెరువు తవ్వకాలపై విచారణ



అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

తాడికొండ: మండలంలోని లాం గ్రామంలో చెరువులో జరిగిన అక్రమ తవ్వకాలపై మంగళవారం జిల్లా అధికారులు విచారణ నిమిత్తం వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గతంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెరువును పరిశీలించి మట్టి తవ్వకాలు ఏ మేరకు జరిగాయనే దానిపై విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన షేక్ అయూబ్‌తో పాటు పలువురు గ్రామస్తులు జరిగిన దోపిడిపై లిఖిత పూర్వకంగా డివిజనల్ పంచాయతీ అధికారి కె.శ్రీనివాసరావుకు వివరించారు. గ్రామంలో 26 ఎకరాల మంచినీటి చెరువులో 10 వేల మంది జనాభా ఉండగా.. జనాభాకు మంచినీరు అందకుండా చెరువును ఎండగట్టి పంచాయతీలో మూకుమ్మడి తీర్మానం చేసి ఎలాంటి అనుమతులు లేకుండా పరిమితికి మించి లోతు తవ్వారని.. ఫలితంగా రూ.కోట్లు కొల్లగొట్టారని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంచర్లకు తరలించిన కారణంగా పంచాయతీ ఆదాయం కోల్పోయిందని అన్నారు. కోట్ల రూపాయలు కొందరి చేతుల్లోకి మళ్లిందని.. దీంతో గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డివిజనల్ పంచాయతీ అధికారి హామీ ఇచ్చారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన



తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫిరంగిపురం: కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ.. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ ఢిల్లీలో ఏడాది పాటు రైతులు ఆందోళన చేసినా కేంద్రం పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికీ మిర్చి, పొగాకు, పత్తి, శనగ పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కార్డులు ఇస్తామని ఎన్నికల సమయంలో హామి ఇచ్చి విస్మరించిందని తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్‌వలి, నాయకులు వెంకటేశ్వరరావు, కార్మిక సంఘం నాయకుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన పదవికి న్యాయం చేస్తాం



దొంతిరెడ్డి వేమారెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నాయకులు

మంగళగిరి టౌన్: సామాన్య కార్యకర్తలమైన మా మీద నమ్మకంతో పదవులు ఇచ్చి ప్రోత్సహించినందుకు ఆ పదవికి న్యాయం చేస్తామని తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ విభాగ అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, ఎస్టీ సెల్ విభాగ అధ్యక్షులు బాలసాని అనీల్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో తమ పదవులకు సహకరించిన నియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్)ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమపై విశ్వాసం ఉంచి పదవులు కేటాయించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి




సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శాఖ మహాసభ శీలం శ్యామ్ అధ్యక్షత నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని విమర్శించారు. 50 ఏళ్లుగా నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో నివాసాలు ఉంటుంన్న వారికి మంత్రి లోకేష్ పట్టాలు ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని.. హామీలో భాగంగా తొలి విడతగా కొన్ని పట్టాలు ఇచ్చారని, అందరికీ న్యాయం చేకూర్చాలని కోరుతున్నామన్నారు. అనంతరం సీతానగరం సీపీఐ శాఖ కార్యదర్శిగా శీలం శ్యామ్ ప్రసాద్, కమిటీ సభ్యులుగా చలవాది గౌరి, శీలం అనిల్, చలువాది బోసు, పాలగర్ల తిరుపతమ్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమల్ల వెంకటయ్య, సీనియర్ నాయకులు మానికొండ డాంగే, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి శ్రీ ప్రపత్తాంజనేయుని బ్రహ్మోత్సవాలు



విశేష అలంకరణలో శ్రీ ప్రపత్తాంజనేయుడు

పొన్నూరు: మండల పరిధిలోని నండూరులో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయని.. 21న ఉదయం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, జరుగుతాయన్నారు. 22న హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఉదయం నిత్య అనుష్టానములు, స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేక అర్చనలు, శతసహస్ర నాగవల్లీ దళార్చన (లక్ష తమలపాకులతో పూజ), హోమాలు, అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. హనుమజ్జన్మ కథ, సాయంత్రం లలితా విష్ణు సహస్రనామ పారాయణ, సహస్ర నామార్చన, హోమం, పంచహారతులు, వేదస్వస్తి ఉంటాయన్నారు. 23న ఉదయం హనుమాన్ చాలీసా పారాయణ, పూజలు, హోమాలు, శ్రీ సువర్చలా హనుమాన్ కల్యాణం, పూర్ణాహుతి నిర్వహిస్తామని పేర్కొన్నారు. 24న సాయంత్రం కల్యాణ మూర్తుల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని శ్రీనివాస శర్మ కోరారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



నగరం: నగరం శివారు గిరిపురంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో వేదపండితులు వ్రత కార్యక్రమాలను శాస్త్ర యుక్తంగా జరిపారు. దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరులో కార్మిక, రైతు సంఘాల నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, బక్కిరెడ్డి, డోకిపర్తి రాజేంద్రబాబు, రత్తయ్య, గోపాలం శంకరరావు, సుబ్బారావు, శివయ్య, కృపారావు, అమ్మిశెట్టి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వైఎస్సార్‌టీయూసీ నియోకవర్గ అధ్యక్షులు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, న్యూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వంలో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, బాలాజీ, చిన్ని సత్యనారాయణ, వైఎస్సార్‌టీయూసీ నాయకులు తిరుమలేశ్వరరావు, పిల్లలమర్రి బాలకృష్ణ, కె.తిరుమలేశ్వరరావు, అమరేశ్వర రావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శ్రీదాసాంజనేయ స్వామి 16వ వార్షికోత్సవ మహోత్సవాలను నిర్వహించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) స్వయం పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సింధూర అర్చన, హారతులు, మంత్రపుష్పం పూజలు చేశారు. 1108 వడలు, తమలపాకులతో పూజ చేశారు. ఈ సందర్భంగా బాలస్వామీజీ మాట్లాడుతూ ఆంజనేయస్వామి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దా భక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాధం రాజేశ్వరరావు పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో మహిళలు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

మండలంలో 61.4 మి.మీ. వర్షపాతం నమోదు

దుగ్గిరాల: మండలంలో సోమవారం ఉదయం నుంచి ఏకధాటిగా కురిసిన వర్షంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కావడంతో మండల ప్రజలు ఉలిక్కిపడ్డారు. దీంతో మండలంలో 61.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని దుగ్గిరాల తాహసీల్దార్ కార్యాలయం నుంచి అధికారులు వర్షమాపిని ద్వారా వివరాలను మంగళవారం వెల్లడించారు.

అభయాంజనేయుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం అడ్డ రోడ్డు వద్దనున్న అభయాంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. నూతన వస్త్రాలతో స్వామిని అలంకరించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు రామ కోటేశ్వరరావు, నాగ మల్లేశ్వరరావులు పర్యవేక్షించారు.

న్యాయస్థానం తీర్పును అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను అమలు చేయాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు వై.సాంబయ్య, తుపాకుల నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. చట్టప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. మంత్రి లోకేష్ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్.కె ఖాసిం, గురవయ్య, నాగేశ్వరరావు, సుభాని, ఇస్మాయిల్, ఇమాంబి, దుర్గ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వాయిదాలకు రాని నిందితుడు అరెస్టు

మంగళగిరి: కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మంగళగిరి ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. విజయవాడ కొత్తపేటకు చెందిన సింహ దుర్గారావు కోర్టు వాయిదాలకు హాజరు కావడంలేదని జడ్జి నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు నిందితుడు దుర్గారావును మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

సీఆర్డీఏ ఆధ్వర్యంలో జాబ్ మేళా

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీ సీఆర్డీఏ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి-శిక్షణ శాఖ సౌజన్యంతో మంగళవారం తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళాకు 589 మంది అభ్యర్థులు హాజరు కాగా 100 మంది ఆఫర్ లెటర్లను అందుకున్నారు. 170 మంది అభ్యర్థులు తదుపరి రౌండ్లకు ఎంపికయ్యారు. కార్యక్రమానికి ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య శిక్షణ అధికారి సాయి శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి సమన్వయ బాధ్యతలు నిర్వర్తించారు. అసిస్టెంట్ డైరెక్టర్ వి.నరసింహారావు, సీఆర్డీఏ డీసీడీఓ బి.శ్రీనివాసరావు, సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలో రైలు పట్టాల సమీపంలో మంగళవారం పేకాట ఆడుతుండగా రూరల్ ఎస్ఐ ఆనంద్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. వెయ్యి స్వాధీనం చేసుకున్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని బండ్ల వెంకట్, జానీబాషా మిత్ర బృందం ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్న దాన కేంద్రంలో మంగళవారం పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. అలాగే అంగలకుదురులోని స్వదార్ హోంలోని విద్యార్థులు, వృద్ధులకు బ్యాగులు, డైనింగ్ చైర్స్, బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ శాంతి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.దినేష్, జి.భార్గవ్, జి.మణి గోపాల్, షేక్ బాషా తలైవా, వి.సూర్య, బాషాజాన్, పి.ఉదయ్ కుమార్, ఎం.నిఖిల్ సాయి పాల్గొన్నారు.